

సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలి

కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన సంఘటన యావత్ దేశాన్ని కుదిపేస్తోంది. ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా ఆసుపత్రుల వద్ద పటిష్ట నిఘా వ్యవస్థ, రక్షణ వ్యవస్థలను వైద్యులు, వైద్య సిబ్బంది కోసం ఏర్పాటు చేయాలి. మహిళా వైద్యులు, సిబ్బంది రక్షణ కోసం సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్టును వెంటనే అమలు చేయాలి.

– పోలిశెట్టి హర్షిత, వైద్యురాలు, పామర్రు పీహెచ్‌సీ





భారతజాతి ఔన్నత్యానికి విఘాతం

కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌ను హత్య చేయడం యావత్ భారతదేశ ఔన్నత్యానికి విఘాతం. వైద్యోనారాయణ హరిః అని వైద్యులను కొనియాడే దేశంలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం విచారకరం. దోషులను కఠినంగా శిక్షించే దిశగా వ్యవస్థలు కృషి చేయాలి. ఘటన జరిగిన వెంటనే దేశ వ్యాప్తంగా ప్రజలు నిరసన తెలపడం వైద్యులు, వైద్య, ఆరోగ్య రంగ సిబ్బందిలో మనో ధైర్యాన్ని నింపింది.


– డాక్టర్ పి.రాజ్‌కుమార్, మెడికల్ సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, కపిలేశ్వరపురం

గణేశ్ ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు

- సిద్ధమవుతున్న చలువ పందిళ్లు
- మట్టి గణపతులే ముద్దంటున్న పర్యావరణ ప్రేమికులు



ప్రతిష్ఠకు సిద్ధమవుతున్న గణేష్ విగ్రహాలు



మట్టి గణనాథుడు

రాయవరం: విఘ్నాలు తొలగించే సిద్ధి వినాయకుడికి నిర్వహించే చవితి వేడుకల సందర్భంగా గణేశ్ ఉత్సవాలకు గ్రామాల్లో చురుగ్గా ఏర్పాట్లు సాగుతున్నాయి. సెప్టెంబరు 7న వినాయక చవితి పర్వదినం సందర్భంగా వినాయకుడికి భక్త కమిటీలు ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయాల వద్ద చలువ పందిళ్లను సిద్ధం చేస్తున్నారు.

క్లస్టర్ పరిధిలో..

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, కె.గంగవరం, కాజులూరు మండలాలు ఉన్నాయి. ఈ మండలాల పరిధిలో 120 గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లో వాడవాడలా గణేశ్ ఉత్సవాలను ఏటా ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా గణేశ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా ఆయా గ్రామాల్లోని యువకులు ఉత్సవ కమిటీలుగా ఏర్పడి ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి గ్రామంలో దాదాపుగా ఐదారు చోట్ల విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పలు గ్రామాల్లో ఆరు నుంచి 12 అడుగుల గణనాథ విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు విగ్రహాల తయారీదారులకు ఆర్డర్లు కూడా ఇచ్చారు. అదేవిధంగా గ్రామాలకు సైతం పాకిన లడ్డూ సంస్కృతిలో భాగంగా లడ్డూలను వినాయకుడి చేతిలో ఉంచేందుకు స్వీట్ స్టాల్స్‌కు ఉత్సవ కమిటీలు ఆర్డర్లు ఇచ్చే పనిలో నిమగ్నమయ్యారు.

మట్టి గణపతులే మేలు..

ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న అతి పెద్ద సమస్య పర్యావరణ కాలుష్యం. సమస్త జీవరాశిపై ఈ సమస్య ప్రభావం చూపుతుంది. సకల విఘ్నాలను తొలగించే గణనాథుడి ప్రతిమల తయారీకి కృత్రిమ రంగులను వినియోగిస్తున్నారు. నిమజ్జనం అనంతరం ఇవి కాలుష్య కారకాలుగా మారి ప్రజలు రోగాలారిన పడుతుంటే, జీవరాశులు మృత్యుబారిన పడుతున్నాయి. దీని నివారణకు మట్టిగణపయ్యలే మేలంటున్నారు పర్యావరణవేత్తలు.

బ్రహ్మ, విష్ణు స్వరూపం

మృత్తిక అంటే మట్టి. మట్టిని బ్రహ్మ, విష్ణు స్వరూపంగా భావిస్తారు. స్వచ్ఛమైన బంకమట్టితో తయారు చేసిన గణనాథులను పూజిస్తే సర్వపాపాలు హరిస్తాయని, అది పుణ్యప్రదమని వేదాలు, పురాణాలు ఘోషిస్తున్నాయి. రసాయిన పదార్థాలతో తయారు చేసిన వినాయక ప్రతిమలతో పర్యావరణానికి విఘ్నాలు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏకో దంతుడికి జై కొడదాం..అనే నినాదం ఇప్పటి నుంచే మార్మోగుతుంది.

చిన్న ప్రతిమలతో ఇబ్బందులు ఉండవు

బంకమట్టితో తయారైన విగ్రహాలను నిమజ్జనం చేస్తే అవి త్వరగా నీటిలో కలసి పోతాయి. బంకమట్టి నీటి స్వచ్ఛతను పెంచేందుకు దోహదం చేస్తుంది. చిన్న సైజు ప్రతిమలను ఏర్పాటు చేస్తే నిమజ్జనం సమయంలో ఇబ్బందులు తలెత్తవు. నిమజ్జనం సమయంలో చిన్న మట్టి విగ్రహాలు నీటిలో కరిగి జలానికి ఎటువంటి నష్టం కలగజేయదు. పర్యావరణానికి మట్టి విగ్రహాలు ఎంతో ఉత్తమం. ఇళ్లలో ప్రతిష్ఠించే చిన్న చిన్న విగ్రహాలతో పాటు మండపాల్లో ప్రతిష్ఠించే భారీ విగ్రహాల వరకు మట్టి గణపతినే ఏర్పాటు చేసుకోవాలని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు.

ఏర్పాట్లు చేస్తున్నాం



ఈ ఏడాది వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. గణనాథుడి విగ్రహాలకు ఆర్డరు ఇచ్చేందుకు కమిటీ సభ్యులు నిర్ణయించుకున్నాం. చిన్నా, పెద్దా ప్రతి ఒక్కరూ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడంలో భాగస్వాములవుతారు.

– కాలా శివశంకర్, ఉత్సవ కమిటీ సభ్యుడు, రాయవరం

భక్తిశ్రద్ధలతో పూజలు



విఘ్నాలు తొలగించే వినాయక చవితిని ప్రతీ ఒక్కరూ భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఊరంతా కలిపి చేసుకునే పండగల్లో వినాయక చవితి ఒకటి. ఉత్సవ కమిటీలు గతంలో మాదిరిగానే ఏర్పాట్లు చేస్తున్నాయి. ఉత్సవ విగ్రహం వద్ద ఏర్పాటు చేసే లడ్డూలకు కూడా డిమాండ్ ఉంటుంది.

– కిలపర్తి పోసిరాములు, చిరుద్యోగి, పసలపూడి, రాయవరం మండలం

గొల్లపాలెం హైస్కూల్‌కు మూడోసారి పురస్కారం



రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి క్రీడా ప్రతిభా పురస్కారాన్ని సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కాజులూరు: స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ, క్రీడా ప్రతిభా పురస్కారానికి గొల్లపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల మరోసారి ఎంపికైనట్టు పీడీ జి.సునీల్‌కుమార్ తెలిపారు. మంగళవారం పాఠశాలలో స్కూల్ హెచ్‌ఎం పి.సుశీలామణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆగస్టు 29 జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని ప్రభుత్వం క్రీడల్లో రాణించిన పాఠశాలలకు స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ, క్రీడా ప్రతిభా పురస్కారాలు ప్రకటించిందన్నారు. 2023–24లో పాఠశాల నుంచి అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో రాణించిన జిల్లాలో ఐదు ఉత్తమ పాఠశాలలకు అవార్డుతో పాటు, నగదు ప్రోత్సాహాలను అందిస్తున్నారన్నారు. గతేడాది స్కూల్ గేమ్స్‌లో తమ పాఠశాల నుంచి రాష్ట్ర స్థాయిలో 40 మంది, జాతీయ స్థాయిలో ఇద్దరు క్రీడాకారులు మెరిట్‌లో రాణించినందుకు ఈ పురస్కారం వచ్చిందన్నారు. గత మూడేళ్లుగా తమ పాఠశాల వరుసగా అవార్డు సాధిస్తుందన్నారు. ఆగస్టు 29 గురువారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో అవార్డులు అందజేయనున్నారన్నారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ కొల్లిశెట్టి సత్యం పాల్గొన్నారు.

వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల నిరసన



కార్యాలయం ఆవరణలో నిరసన తెలుపుతున్న వాణిజ్య పన్నుల శాఖ అధికారులు, సిబ్బంది

మండపేట: వాణిజ్య పన్నుల శాఖలో 2.0 ప్రకారం జరుగుతున్న బదిలీలను పునః సమీక్షించాలని ఆ శాఖ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.రవిశంకర్, జీఎస్‌టీవో బి. శ్రీనివాస్, ఏఈ ఎం. ఉల్లక్కిరావు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగులు మంగళవారం నాటి మధ్యాహ్న భోజన విరామ సమయంలో తమ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ ఈ సందర్భంగా వారు నినాదాలు చేశారు. రాష్ట్రపతి ఉత్తర్వులకు వ్యతిరేకంగా జరిగిన బదిలీలను వెంటనే రద్దు చేయాలని కోరారు. వాణిజ్య పన్నుల శాఖ పునర్వ్యవస్థీకరణ పేరుతో జరిగిన విధ్వంసంపై దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. జీఎస్‌టీవో (ఏసీటీవో) లకు చట్టబద్ధమైన అధికారాలు కల్పించాలని కోరారు. సెంట్రల్ రిజిస్ట్రేషన్ యూనిట్ (సీఆర్‌యూ)ను రద్దు చేయాలన్నారు. సర్కిల్ వ్యవస్థను బలహీనపరిచే చర్యలను వ్యతిరేకిస్తున్నామన్నారు. రీజినల్ కార్యాలయాలను రద్దు చేయాలని వారు కోరారు. అప్పటి వరకు బదిలీలు వాయిదా వేయాలని, ఉద్యోగుల బదిలీలపై శాశ్వత విధానం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జీఎస్‌టీవోలు, ఏఈవోలు, ఈటీఏలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మండపేటలో దోమల నిర్మూలనకు చర్యలు



దోమల మందు పిచికారీ చేయిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్



దోమల మందు పిచికారీ చేయిస్తున్న కౌన్సిలర్ రవికుమార్

మండపేట: పట్టణంలో దోమల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావణ్య తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, కమిషనర్ బి. రాము ఆదేశాల మేరకు పట్టణంలోని 30 వార్డుల్లో దోమల నివారణ చర్యలకు ఉపక్రమించామన్నారు. ఇందుకోసం డ్రెయిన్లలో ఆయిల్ బాల్స్, ఫాగింగ్‌తో పాటు స్ప్రేయింగ్ మిషన్‌ల ద్వారా దోమల మందు పిచికారీ చేయిస్తున్నామన్నారు. ప్రజలు తమ ఇళ్ల వద్ద పేరుకున్న చెత్తను పారిశుద్ధ్య కార్మికుల చేతికి అందివ్వాలన్నారు. డ్రైన్లలో విడిచి పెట్టొద్దన్నారు. తడి పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలన్నారు. అలాగే మందులు, ఇంజెక్షన్ బాటిల్స్, సిరంజ్‌లు, మిగిలిపోయిన టాబ్లెట్స్, ప్లాస్టిక్ కవర్లు వంటి ప్రమాదకర వ్యర్థాలను రెడ్ కలర్ డస్ట్ బిన్ ద్వారా కార్మికులకు అందజేయాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

8వ వార్డులో దోమల మందు పిచికారీ

పట్టణంలోని 8వ వార్డు పరిధిలో కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. పారిశుద్ధ్య కార్మికునితో కలసి ఆయన వార్డులోని ప్రతి వీధినీ తనిఖీ చేశారు. కౌన్సిలర్ రవికుమార్ దగ్గరుండి దోమల మందు స్ప్రేయింగ్ చేయించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ దోమల వ్యాప్తి చెందకుండా వార్డులో చర్యలు తీసుకుంటున్నామన్నారు. విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున వార్డు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.


వ్యక్తిత్వ వికాసమే అసలైన విద్య



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసచౌదరి

రామచంద్రపురం: మనిషికి సరైన వ్యక్తిత్వాన్ని అందించేదే అసలైన విద్య అని విశ్వ మానవతా సేవా సంస్థ వ్యవస్థాపకుడు అల్లూరి శ్రీనివాసచౌదరి అన్నారు. పట్టణంలోని వీఎస్‌ఎం అటానమస్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన వ్యక్తిత్వ వికాస సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకునే నైపుణ్యాలను విద్యార్థులకు వివరించారు. సంస్కారంతో పాటు జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి అనేక యోగ మార్గాలున్నాయని అన్నారు. పట్టుదల, ఏకాగ్రత ఏర్పరచుకోవడానికి నిత్యం శ్రమించాలని సూచించారు. కళాశాల వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ విద్యార్థుల్లో మానసిక వికాసం పెరగడానికి ఈ సదస్సు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విశ్వ మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా సమాజానికి సేవ చేస్తున్న శ్రీనివాసచౌదరిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎన్ అలీ అన్సారీ, ఎన్ఎస్ఎస్ అధికారులు, అధ్యాపకులు నిమ్మకాయల ప్రసాద్, ఎ.రాంబాబు, కృష్ణవేణి, నందిని, విద్యార్థులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యపై దృష్టి సారించాలి



బహుమతులు అందజేస్తున్న దాత సత్యనాగ భూషణరావు, ప్రభావతి, హెచ్‌ఎం సాయిరామ్

అంబాజీపేట: శాస్త్ర సాంకేతిక విద్య వైపు ప్రతి విద్యార్థి దృష్టి సారించాలని హెచ్‌ఎం కె.సాయిరాం అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో 6 నుంచి తొమ్మిదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు దాతలు అందించిన సాయాన్ని మంగళవారం పంపిణీ చేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ కామిశెట్టి సత్యనాగ భూషణరావు తల్లిదండ్రులు కామిశెట్టి వీరాస్వామినాయుడు, సూర్యకాంతం ట్రస్ట్ పేరున 3 నుంచి తొమ్మిదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు, పెన్నులు, ఫోల్డర్లను అందజేశారన్నారు. సత్యనాగభూషణరావు ఆధ్వర్యంలో ట్రస్ట్ పేరున గత 26 ఏళ్లగా రూ.4 వేలు చొప్పున విద్యార్థులకు నగదు బహుమతులను పంపిణీ చేస్తున్నారన్నారు. అనంతరం సత్యనాగభూషనరావు, ప్రభావతి దంపతులను ఎస్ఎంసీ చైర్మన్ పితాని త్రిమూర్తులు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పీఎంసీ వైస్ చైర్మన్ బండారు అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

'మాదిరెడ్డి' ట్రస్ట్ సేవలు అభినందనీయం



విద్యార్థికి ఉపకార వేతనం అందిస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

రాజోలు: మాదిరెడ్డి వెంకట సూర్యకాంతం మెమోరియల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని పలువురు అన్నారు. మంగళవారం రాజోలులోని ట్రస్ట్ ఆధ్వర్యంలో 40 మంది విద్యార్థులకు రూ.1.72 లక్షలు ఉపకార వేతనాలుగా అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ మేడిచర్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ 2006లో ట్రస్ట్ వ్యవస్థాపకుడు మాదిరెడ్డి శ్రీనివాసరావు ట్రస్ట్‌ను కుల, మతాలకు సంబంధం లేకుండా పూర్ అండ్ మెరిట్ ఆధారంగా ఇంటర్ నుంచి పీజీ అభ్యసిస్తున్న విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించేలా ఏర్పాట్లు చేశారన్నారు. ప్రస్తుతం విద్యారంగంలో చాలా పోటీ ఉందన్నారు. పోటీకి తగిన విధంగా విద్యార్థులు స్కిల్ పవర్‌తో పాటు విల్‌పవర్‌ను సాధించాలన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాధన దిశగా కష్టపడి ఇష్టంగా చదవాలన్నారు. ముఖ్యఅతిథులుగా మామిడికుదురు, విశ్వేశ్వరాయపురం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీను, సీహెచ్ చింతామణి పాల్గొని విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. ఉపాధ్యాయులు కంకటాల శ్రీనివాసరావు, ఆకుల శ్రీనివాస్, పిండి ప్రసాద్, మాదిరెడ్డి ప్రసాద్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చింతలపల్లి ఉన్నత పాఠశాలకు అవార్డు

రాజోలు: చింతలపల్లి ఉన్నత పాఠశాలకు స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ క్రీడా ప్రతిభా అవార్డు వరుసగా రెండో పర్యాయం లభించింది. ఈ మేరకు మంగళవారం క్రీడల్లో ప్రతిభ చూపి అవార్డు సాధించిన పాఠశాలకు చెందిన క్రీడాకారులను అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు దొంగ జానకిరామయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు ప్రసంగించారు. పాఠశాలకు చెందిన 31 మంది విద్యార్థులు బాక్సింగ్, ఫెన్సింగ్, కరాటే, క్రికెట్, రైఫిల్ షూటింగ్, సైక్లింగ్, ఆర్చరీ, రెజ్లింగ్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో రాణించారన్నారు. స్కూల్ గేమ్స్ పోటీల్లో ప్రతిభ చూపిన ఐదు పాఠశాలల్లో చింతలపల్లి ఉన్నత పాఠశాల ఉండడం అభినందనీయమన్నారు. ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని అవార్డు అందిస్తారన్నారు.

క్లుప్తంగా

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



మాచరలో వృద్ధురాలికి దుప్పటి అందజేస్తున్న హెచ్‌ఎం రమాదేవి

కపిలేశ్వరపురం: మండలంలోని మాచర గ్రామంలో మంగళవారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. మదర్ థెరిసా జయంతి కార్యక్రమాల్లో భాగంగా విజయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ నిర్వాహకులు విజయమోహన్ పర్యవేక్షణలో ప్రతిభ గల విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు, పరీక్ష అట్టలు అందజేశారు. మాచర జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రమాదేవి మాట్లాడుతూ విజయం చారిటబుల్ ట్రస్ట్ పదేళ్లుగా చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు విజయ్, సుంకర సాయి, మంతెన హేమంత్, పృథ్వీరాజ్, అవినాష్, ధనప్రసాద్, పవన్ కుమార్, శివాజీ, ఉపాధ్యాయులు నూకపెయ్యి వెంకట్రావు, వాడ్రేవు శ్రీనివాస్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో వంతెన



వట్రపూడిలో శిథిలావస్థకు చేరిన వంతెన

కె.గంగవరం: మండలంలోని అద్దంపల్లి–వట్రపూడి రహదారిలోని వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ఈ రహదారిని నిత్యం వందలాది మంది ప్రజలు ఉపయోగించుకుని అటు కాజులూరు మండలం, ఇటు కె.గంగవరం మండలం, ద్రాక్షారామలకు చేరుకుంటారు. ఈ రహదారిలో వంతెన శిథిలావస్థకు చేరడంతో పాటు ఇరువైపులా రక్షణ గోడలు కూడా లేవు. దీంతో వంతెన ప్రమాదకరంగా మారిందని అప్పుడప్పుడు ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేయాలి



ఆర్యావటంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ

కాజులూరు: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నాటికి రాష్ట్రంలో బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి బీజేపీ కార్యకర్తపైనా ఉందని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ అన్నారు. ఆర్యావటంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సలాది వీరవెంకటసత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో పార్టీ కేంద్రంలో అత్యంత బలోపేతంగా ఉందన్నారు. కార్యకర్తలు మండల గ్రామాల్లో ఇంటింటా పర్యటించి గడచిన పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిపై ప్రజలకు వివరిస్తూ ప్రతి ఒక్కరితో సభ్యత్వాలు స్వీకరించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శులు పోలిశెట్టి శ్రీనివాస్, పుణ్యమంతుల శివాజీ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు తలాటం అమ్మాజీ, జాతీయ కౌన్సిల్ సభ్యుడు రొక్కాల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సబ్ జూనియర్స్ జట్ల ఎంపిక

రామచంద్రపురం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ బాలబాలికల ఎంపికలు సెప్టెంబర్ ఒకటిన ఆదివారం శంఖవరం మండలంలోని అన్నవరంలో సత్యదేవ జూనియర్ కళాశాల గ్రౌండ్స్‌లో నిర్వహించనున్నట్లు ఉమ్మడి తూర్పుగోదావరి బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ ముప్పన వీర్రాజు, అధ్యక్షుడు వీరభద్రస్వామి, కార్యదర్శి ఓలేటి సీతాపతిరావు విలేకరులకు తెలిపారు. 2009 జనవరి 2వ తేదీ తరువాత జన్మించిన ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈ ఎంపికల్లో పాల్గొనవచ్చని అన్నారు. పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, విద్యార్థత సర్టిఫికెట్లతో డ్రెస్ కోడ్ పాటించి ఎంపికలకు రావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నెంబర్లు 99499 59951, 80082 66003లపై సంప్రదించాల్సిందిగా కోరారు.

శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు

అయినవిల్లి: భక్తి వేదాంత స్వామిగా ప్రభుపాదుల వారిని కొలుస్తారని, శ్రీకృష్ణాష్టమి మరుసటి రోజు ఆయన ఆవిర్భంచిన పవిత్ర దినంగా ప్రత్యేక పూజలు చేస్తారని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణమందిర్ నిర్వాహకుడు ప్రభు సుందరశ్రీనివాసదాస్ అన్నారు. మంగళవారం ప్రభుపాదులు అవతరించిన సందర్భంగా శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రభుపాదుల చిత్రపటం వద్ద పాద పూజ చేశారు. ప్రత్యేక హారతులు ఇచ్చారు.

ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకే 'మీకు తెలుసా'



ద్రాక్షారామ ఎస్వీ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఐసీటీసీ కౌన్సిలర్ గీతాంజలి

రామచంద్రపురం రూరల్: ప్రజల్లో ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సూచించిన విధంగా జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి ఐసీటీసీ, జన కల్యాణి వెల్ఫేర్ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ద్రాక్షారామలోని వేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో 'మీకు తెలుసా' నిర్వహించారు. ఐసీటీసీ కౌన్సిలర్ గీతాంజలి విద్యార్థులకు హెచ్ఐవీ ఎన్ని విధాలుగా వస్తుంది, నివారణ చర్యల గురించి వివరించారు. అదే విధంగా లైంగిక వ్యాధుల కౌన్సిలర్ నాగు మాట్లాడుతూ లైంగిక వ్యాధుల లక్షణాలు, చికిత్స విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శీలం రాకోరాజు, అధ్యాపకుడు పి.రాంబాబు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు దొరబాబు, లక్ష్మి, కళాశాల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

వెలంపాలెంలో వైద్య శిబిరం



వెలంపాలెంలో దోమల నివారణ ద్రావకాలను పిచికారీ చేయిస్తున్న వైద్య సిబ్బంది

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెలంపాలెంకు చెందిన అడపా పావని డెంగీ జ్వరంతో చికిత్స పొందుతూ కాకినాడ జీజీహెచ్‌లో మృతి చెందిన సంఘటన నేపథ్యంలో గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరం మంగళవారం కూడా కొనసాగించారు. వైద్యశాఖ సబ్ యూనిట్ అధికారి నాగబాబు నేతృత్వంలో గ్రామంలో దోమల లార్వాను చంపే ద్రావకాలను ఇళ్లలోను, డ్రైన్లు, చెత్త పేరుకు పోయిన ప్రాంతాల్లోను పిచికారీ చేయించారు. ఆరోగ్య సిబ్బందితో కలసి గ్రామస్తులకు విషజ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

గురుకుల విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ లలితకుమారి

రాజోలు: వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో రాజోలు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చూపారు. ఈ మేరకు మంగళవారం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ టి.లలితకుమారి ఆధ్వర్యంలో విద్యార్థినులను అభినందించారు. ఈ నెల 27న అమలాపురం మండలం వన్నెచింతలపూడిలో జరిగిన మండల, జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. వ్యాసరచన పోటీల్లో తొమ్మిదో తరగతి విద్యార్థినులు ఎం.జోయల్ మెర్సీ, సీహెచ్ వసంతలక్ష్మి, సీహెచ్ సౌభాగ్యలక్ష్మి, ఉపన్యాస పోటీల్లో పదో తరగతి విద్యార్థినులు ఎస్.రత్నవల్లి, జె.స్నేహిత, ఐ.కీర్తన ప్రతిభ కనబరిచారు. వైస్ ప్రిన్సిపాల్ బి.అనితకుమారి, ఉపాధ్యాయులు, కళాశాల సిబ్బంది విద్యార్థినులను అభినందించారు.

గోదావరి నదీ తీరంలో కలవరం



పెదపట్నంలంకలో దిగబడిన గోదావరి నది ఒడ్డు

మామిడికుదురు: పెదపట్నంలంకలోని నదీ తీరంలో గోదావరి ఒడ్డు ఒక్కసారిగా దిగబడిపోయింది. సుమారు 30 మీటర్ల పైగా భూమి కొబ్బరి చెట్లతో సహా నదిలోకి జారిపోవడంతో తీరంలోని రైతులు కలవరం చెందుతున్నారు. గత నెలలో గోదావరి నదికి వచ్చిన వరదల అనంతరం గోదావరి కోత విపరీతంగా పెరిగిందని రైతులు వాపోతున్నారు. పెదపట్నం, అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడి, ఆదుర్రు గ్రామాల్లో పలు కొబ్బరి చెట్లతో పాటు సారవంతమైన భూమి ఒక్కసారిగా నదిలోకి జారిపోతుందని రైతులు తీవ్రంగా మదన పడుతున్నారు. అప్పనపల్లిలో గోదావరి కోత ఇళ్లను సమీపించిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో హామీలు ఇవ్వడం మినహా కోత నివారణకు పాలకులు తీసుకుంటున్న చర్యలు శూన్యమని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోత నివారణకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.